ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 21 ఆగస్టు 2024

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీ, అనధికార లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలివేసింది. అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో వేలాదిగా దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోనే సుమారు పది వేల దరఖాస్తులు వచ్చాయి. తాజాగా ఈ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపడుతున్నట్లు ప్రకటించి విధివిధానాలను రూపొందించింది. దీంతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మూడు బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాయి.

- సరూర్‌నగర్‌లో అత్యధికంగా 149.1మి.మీ వర్షపాతం నమోదు
- వరద ప్రవాహానికి మేడికుంట కట్టకు గండి
- పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- వికారాబాద్ జిల్లాలో దెబ్బతిన్న పంటలు
- నిండుగా ప్రవహిస్తున్న మూసీ నది
- మదనపల్లిలో ఇళ్లలోకి వరద నీరు
- పొంగిపొర్లిన దోర్నాల్ వాగు..


వికారాబాద్ జిల్లా మైలార్‌దేవరంపల్లిలో వరద తీవ్రతకు నేల వారిన పత్తి పంట


నాగారం మున్సిపాలిటీ సాయినగర్ కాలనీలో నిలిచిన వరద నీరు

కుండపోత

ఉమ్మడి జిల్లాలో దంచికొట్టిన వాన » జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వర్షం దంచి కొట్టింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు 24 గంటల పాటు భారీ వర్షపాతం నమోదైంది. మంగళవారం తెల్లవారు జాము నుంచి పలు చోట్ల కుండపోతగా వాన పడింది. ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. దీంతో హైదరాబాద్‌కు తాగునీరు అందించే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు భారీగా వరదనీరు చేరుతోంది. ఈ సీజన్‌లో ఇదే అతిపెద్ద వర్షంగా చెప్పవచ్చు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత కూడా చాలా చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరింది. చెక్‌డ్యాంలు అలుగు పారాయి. ప్రధాన మార్గాలు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని నగర శివార్లలోని పలు కాలనీలు నీట మునిగాయి. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్ వద్ద రికార్డు స్థాయిలో 149.1 మి.మీ వర్షపాతం నమోదైంది. మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో 140 మి.మీ, ఉప్పల్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ ఆఫీస్ వద్ద 135 మి.మీ వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 98.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా వాతావరణ పరిస్థితుల అనుకూలించక ఇప్పటికే పలు మండలాల్లో ఆశించిన స్థాయిలో పంటలు సాగు జరగలేదు. ఇపుడు కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా కొన్ని పంటలకు నష్టం జరుగుతోంది. ముఖ్యంగా కూరగాయ, ఉద్యాన పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది.

వికారాబాద్(ఆంధ్రజ్యోతి)/ రంగారెడ్డి అర్బన్, మేడ్చల్ (ఆంధ్రజ్యోతి) ఆగస్టు 20: వికారాబాద్ జిల్లాలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. వికారాబాద్, యాలాల్, కులకచర్ల, దోమ, కొడంగల్, పూడూరు, కోట్‌పల్లి, పరిగి మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండు నుంచి మూడు గంటల పాటు కురిసిన ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వికారాబాద్ మండలంలో మైలార్‌దేవరంపల్లి, కోట్‌పల్లి మండలం, జిన్నారం గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో పక్కనే ఉన్న పంటలు నీట మునిగాయి. పత్తి, పసుపు పంటలతో పాటు వివిధ కూరగాయల పంటలు, పూల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ రెండు గ్రామాల్లోనే 500 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. కాగా, భారీ వర్షానికి క్షేత్ర స్థాయిలో జరిగిన పంట నష్టం మరింత ఎక్కువగా ఉండవచ్చని తెలుస్తోంది. వికారాబాద్ మండలంలో కురిసిన వర్షానికి మదన్‌పల్లిలో చెక్‌డ్యాం కట్ట తెగి గ్రామంలోకి భారీగా వరద నీరు చేరింది. గ్రామంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. గిరిగెట్‌పల్లి వాగు పొంగి ప్రవహించడంతో రైల్వే బ్రిడ్జి కిందకు భారీగా వరద నీరు చేరుకోవడంతో వికారాబాద్ - గిరిగెట్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కురిసిన వర్షానికి చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది.

నీట మునిగిన పంట పొలాలు

భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో జిన్నారం, మైలార్‌దేవరంపల్లి గ్రామాల పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు జలమయమయ్యాయి. ఎదుగుతున్న పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి పంటలు చేతికి వస్తాయని ఆశపడితే కురిసిన భారీ వర్షం ఆశలు గల్లంతు చేసిందంటూ బాధిత రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.


మేడికుంటకు పడిన గండి.. వృథాగా పోతున్న నీరు

ఇళ్లలోకి వరద నీరు

వికారాబాద్/ ధారూరు/ బంట్వారం (కోట్‌పల్లి)/ యాలాల/నవాబుపేట : మదనపల్లిలో గుట్టపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో చెక్ డ్యామ్ కట్ట తెగిపోయింది. దీంతో వరద నీరు ఇండ్లలోకి చేరింది. సామగ్రి నీటిలో తడిసిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ ధారూరు, దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగిపొర్లి తాత్కలిక వంతెన పై నుంచి ప్రవహించింది. దీంతో నాగారం, దోర్నాల్ గ్రామాల వైపు నుంచి ధారూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. కోట్‌పల్లి మండల పరిధిలోని జిన్నారం నాగసాన్‌పల్లి, కంకణాలపల్లి ఎన్నారం తదితర గ్రామాల్లో వర్షానికి వాగులు

మిగతా 7వ పేజీలో...

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
రంగారెడ్డి జిల్లా..		
సరూర్‌నగర్	జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్	149.1
రాజేంద్రనగర్	రాజేంద్రనగర్ (ఏఆర్‌ఎస్)	125.0
సరూర్‌నగర్	ఎల్బీనగర్ (జీహెచ్‌ఎంసీ ఆఫీస్)	125.3
రాజేంద్రనగర్	జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీస్	106.0
సరూర్‌నగర్	అలకాపురి కమ్యూనిటీ హాల్	104.3
రాజేంద్రనగర్	శివరాంపల్లి	93.8
సరూర్‌నగర్	రాక్‌టౌన్ కాలనీ	90.0
రాజేంద్రనగర్	శాస్త్రీపురం	81.8
రాజేంద్రనగర్	లింగోజిగూడ	80.0
మేడ్చల్ జిల్లా..		
బాల్‌నగర్	ఫతేనగర్	140.3
ఉప్పల్	జీహెచ్‌ఎంసీ ఆఫీస్	135.0
ఉప్పల్	న్యూ నాగోల్ వెల్ఫేర్ అసోసియేషన్	124.6
కాప్రా	ఈఐఎస్ఎస్ మల్కారం	115.0
ఉప్పల్	మారుతీ నగర్	105.5
కుత్బుల్లాపూర్	వార్డు ఆఫీస్, గాయత్రీనగర్	138.0
మేడ్చల్	ఇండస్ట్రియల్ ఏరియా	96.8
కుత్బుల్లాపూర్	ఈఐఎస్ఎస్ జీడిమెట్ల	93.5
మల్కాజిగిరి	వినాయకనగర్	77.5
వికారాబాద్ జిల్లా..		
వికారాబాద్	మర్పల్లి	98.3
యాలాల్	యాలాల్	71.3
కుల్కచర్ల	ముజాహిత్‌పూర్	66.8
దోమ	దోమ	66.0


చేవెళ్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది




నవాబుపేట మండలంలో నిండుగా ప్రవహిస్తున్న మూసీ

ఉప్పొంగిన మూసీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 9సెం.మీల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షం కురవడంతో మూసీ వాగు ఈ సీజన్‌లో మొదటిసారిగా ఉప్పొంగింది. ఈ వర్షంతో పంటలకు జీవం వచ్చినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టంగుటూరు ఉన్నత పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరడంతో అది చెరువును తలపిస్తోంది.

నిండుకుండలా గొర్లకుంట చెరువు

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. కడ్తాల్ సమీపంలోని గొర్లకుంటలోకి భారీగా వరద నీరు చేరడంతో నిండుకుండలా మారింది. మేడికుంటలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో నీటి ప్రవాహానికి కుంట కట్టకు గండి పడింది. దీంతో పెద్ద ఎత్తున గండి నుంచి నీరు వృథాగా పోతుంది. గండిని వెంటనే పూడ్చి నీరు వృథా కాకుండా చూడాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. కుంట కట్టను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌నాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, జహంగీర్ అలీ, గూడెపు జంగయ్య, రవి, తదితరులు ఉన్నారు.

ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపడతున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, ధరణి, నూతన రెవెన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడారు. జిల్లాలోని మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని, ఎక్కడ చిన్న సమస్య వచ్చిన పరిష్కరించేందుకు బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ధరణి దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఆర్‌ఓఆర్ ముసాయిదా 2024 బిల్లుపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని ఆమె వివరించారు. సమావేశంలో పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి, రెవెన్యూ, ట్రాన్స్‌కో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు
» తిమ్మాపూర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు

కొత్తూర్, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. తిమ్మాపూర్‌లోని ఆర్కే కాలనీలో వారం రోజులుగా విషజ్వరాలు ప్రబలి కొందరు అస్వస్థతకు గురయ్యారు. ఒకరు డెంగీతో మృతిచెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ వార్తకు స్పందించిన డీఎంహెచ్‌వో, షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి మంగళవారం తిమ్మాపూర్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను శిబిరాల వద్దకు తోలుకొచ్చి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రస్తుతం విషజ్వరాలు అధికంగా వస్తున్నాయని, ప్రజలు ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ, దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ అధికారులను కోరారు. జ్వర పీడితుల రక్త నమూనాలను కొండాపూర్ ఆసుపత్రికి పంపాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హరికిషన్, ఉదయ్‌కిరణ్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సీహెచ్‌వో నగేష్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో

నోడల్ అధికారుల నియామకం



రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ మండలంలో రైతుల రుణమాఫీ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి పరిష్కరించేందుకు జిల్లాలోని 27 మండలాలకు నోడల్ అధికారులుగా వ్యవసాయ అధికారులను నియమించారు. ఈ నోడల్ అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు.

మండలం	వ్యవసాయ అధికారి	ఫోన్ నంబర్
మహేశ్వరం	డి.నాగమణి	7288894648
కందుకూరు	కృష్ణమోహన్	7288894649
సరూర్‌నగర్	సకలేశ్	9705220090
బాలాపూర్	సకలేశ్	9705220090
ఆమనగల్	శ్రీనివాస్‌గౌడ్	7288894314
కడ్తాల్	పి.కవిత	7288894679
తలకొండపల్లి	వి.రేణుకాచక్రవర్తి	7288894316
మాడ్గుల	డి.అరుణ కుమారి	7288894315
కేశంపేట్	పి.శిరీష	7288894309
కొందుర్గు	శోభరాణి	7799255755
చౌదరిగూడెం	రాజేందర్‌రెడ్డి	7288894897
కొత్తూరు	పి.గోల్	7288894311
నందిగామ	వాణి	9581472988
ఫరూక్‌నగర్	నిశాంత్‌కుమార్	7288894308
ఇబ్రహీంపట్నం	విద్యాధరి	7288894643
మంచాల	మాధవీలత	7288894645
అబ్దుల్లాపూర్‌మెట్	పల్లవి	9652674325
హయత్‌నగర్	సోలోమన్ నాయక్	7288894425
యాచారం	రవినాథ్	7288894644
చేవెళ్ల	శంకర్‌లాల్	7288894655
మొయినాబాద్	అనురాధ	7288894656
శంకర్‌పల్లి	చైతన్య	7288894657
షాబాద్	బి. వెంకటేశం	7288894658
రాజేంద్రనగర్	శ్రీలత	9866033900
గండిపేట్	శ్రీలత	9866033900
శేరిలింగంపల్లి	శ్రీలత	9866033900
శంషాబాద్	శ్వేత	7331109872

షాద్‌నగర్‌లో దొంగల బీభత్సం

» ఐదు దుకాణాల్లో దొంగతనం
» రూ.ఐదు లక్షలు అపహరణ

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 20: షాద్‌నగర్ పట్టణంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఐదు దుకాణాల్లో చోరీకి తెగబడి అందినకాడికి దోచుకున్నారు. గడ్డపారలతో షెటర్లను ఎత్తి, దుకాణాల్లో చొరబడిన దొంగలు ఐదు లక్షల నగదును దొంగలించుకుని పోయారు. స్థానిక చౌరస్తాలో జీఆర్ మొబైల్ అండ్ ఎలక్ట్రానిక్స్ దుకాణంలోకి చొరబడి కౌంటర్‌లోని రూ.1.6 లక్షలను దొంగలించారు. అలాగే జడ్చర్ల రోడ్డులోని వోల్టాస్ మొబైల్ దుకాణంలోని కౌంటర్‌లోని రూ.1.45లక్షలను, పరిగి రోడ్డులోని అంబిక ఎలక్ట్రానిక్ షాపులో రూ.60 వేలు, లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో రూ.15 వేలను ఎత్తుకెళ్లారు. పట్టణ శివారులోని నేషనల్ మార్ట్‌లో కూడాదొంగ తనానికి యత్నించారు. వోల్టాస్ మొబైల్ షాపులో సీసీ కెమెరాకు సంబంధించిన డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. పట్టణ ప్రధాన రోడ్లోని దుకాణాల్లోనే దొంగతనాలు జరగడంతో పట్టణవాసులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కారులో వచ్చిన నలుగురు ఈ దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం ఉదయం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాలకు చెరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలను సేకరించారు. దొంగతనాల ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.


పగలగొట్టిన మొబైల్ దుకాణం షెటర్

హైతాబాద్‌లోనూ స్వైర విహారం

షాబాద్: హైతాబాద్‌లోని పారిశ్రామిక వాడలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు స్వైరవిహారం చేశారు. ఒకే సారి మూడు షాపుల్లో చోరీ చేశారు. షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హైతాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున శ్రీకృష్ణ సూపర్ మార్కెట్‌లో రూ.2 లక్షలు, వినాయక మొబైల్స్‌లో రూ.లక్ష, బాలాజీ మొబైల్స్‌లో రూ.45 వేల నగదును ఎత్తుకెళ్లారు. అయితే అందులో లక్షల రూపాయలు విలువ చేసే ఫోన్లు మాత్రం దొంగలు ముట్టుకోలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్, ఎస్‌వోటీ టీంలు చోరీ జరిగిన వ్యాపార సముదాయాల్లో ఫింగర్‌ప్రింట్స్‌ను సేకరించారు. ఈ దొంగతనాల్లో నలుగురు ఉన్నాట్లు సీసీ పుటేజీలో గుర్తించారు. మొత్తంగా దాదాపు రూ.3.45 లక్షల నగదు తస్కరించినట్లు గుర్తించారు. దొంగలు ఎక్స్‌యూవీ మహీంద్రా 500 వాహనంలో వచ్చినట్లు గుర్తించారు. సంఘటన స్థలాన్ని క్రైం ఏసీపీ శంశాక్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ కిషన్, ఎస్‌వోటీ, క్లూస్‌టీం తదితరులు పరిశీలించారు.


హైతాబాద్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- నిబంధనలు పాటించని అధికారులు
- ఇష్టానుసారంగా ఫైన్లు వేస్తున్న పారిశుధ్య విభాగం
- ఇదేమిటంటే కమిషనర్ ఆదేశాలంటున్న వైనం

జరిమానాల్లో తేడాలెందుకో!

తాండూరు, ఆగస్టు 20: తాండూరు మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు ఇష్టానుసారంగా నిబంధనలు పాటించకుండా జరిమానాలు విధిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం ఏ సెక్షన్ ప్రకారం ఫైన్లు వేస్తున్నారో చెప్పడంలేదు. తాము వేసిన జరిమానా కట్టాల్సిందేనని హుకూం జారీ చేస్తున్నారు. ఇది తాండూరు మున్సిపాలిటీలో ఆరు నెలలుగా కొనసాగుతున్న వ్యవహారం. ఇదేమిటని ప్రశ్నిస్తే మా కమిషనర్ సార్ ఆదేశానుసారంగా ఫైన్ వేస్తున్నామని సమాధానమిస్తున్నారు. గత మార్చి నెలలో ఇందిరా చౌక్‌లోనున్న మెట్రో మనీలా రెస్టారెంట్‌కు అపరిశుభ్రత పేరిట రూ.25వేల జరిమానా విధించారు. ఈ హోటల్‌పై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అయినా తనిఖీ పేరిట వచ్చి సానిటేషన్ విభాగం అధికారులు జరిమానా విధించారు. తాజాగా అదే ఇందిరాచౌక్ ప్రాంతంలోని మిలాప్ జ్యూస్ సెంటర్‌లో కుళ్లిన పండ్లు, ఫ్రూట్ సలాడ్‌లో పురుగులు రావడం అనారోగ్యం పాలయ్యేలా జ్యూస్‌లు ఉన్నాయంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈనెల 16న ఈ జ్యూస్ సెంటర్‌ను మున్సిపల్ యంత్రాగం హంగామా చేసి సీజ్ చేశారు. రెండు రోజుల తర్వాత అదీ సెలవు రోజైన ఆదివారం పారిశుధ్య అధికారులు రూ.10వేలు జరిమానా విధించి జ్యూస్ సెంటర్ తెరిచేందుకు అనుమతించారు. ఆదివారం సెలవు రోజైనా ఇంత హడావుడిగా తెరవాల్సిన అవసరమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అపరిశుభ్రత పేరుతో ఇంతకు ముందే వేరే హోటల్స్‌కు ఎక్కువ జరిమానా విధించి ఈ జ్యూస్ సెంటర్‌కు మాత్ర రూ.10వేలు మాత్రమే జరిమానా విధించడంలో అంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యను వివరణ కోరగా కమిషనర్ ఆదేశానుసారంగా ఓపెన్ చేశామని, కమిషనర్ చెప్పిన విధంగా జరిమానా విధించామని, తమ సొంతంగా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. దీన్నిబట్టి మున్సిపల్ అధికారులు సెటిల్‌మెంట్ చేసుకున్న వారికి ఒక విధంగా, నిలదీసిన వారికి మరో విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

శాంపిల్ పంపించకుండానే..!

మిలాప్ జ్యూస్ సెంటర్‌లో పురుగులు పట్టిన ఫ్రూట్ సలాడ్‌ను ఫుడ్ సెఫ్టీ అధికారులకు పంపించాలి. శాంపిల్‌ను ఫుడ్‌సేఫ్టికి పంపకుండానే స్థానిక కమిషనర్ తన స్థాయిలోనే నిర్ణయం తీసుకొని జరిమానా విధించారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం ఫుడ్ సెఫ్టీ కార్యాలయానికి శాంపిల్‌ను పంపించి అక్కడి నుంచి వచ్చిన ఆదేశానుసారంగా చర్యలు ఉండాలి. తాండూరు మున్సిపాలిటీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జరిమానాలు విధిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాపార వర్గాల మౌనమెందుకు?

ఇష్టానుసారంగా జరిమానాలు విధిచడంపై వ్యాపార, వాణిజ్య వర్గాలు, సంఘాలు మౌనం వహించడంపై చర్చ జరుగుతోంది. నిబంధనలు పక్కకు పెట్టి ఉన్నతాధికారి ఫిర్యాదులు వస్తే చాలు తమకు నచ్చిన రీతిలో జరిమానాలు విధించడంపై ఎందుకు ప్రశ్నించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఈ సంఘాలు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్న చిరు వ్యాపారులు నుంచి వ్యక్తమవుతోంది. వేల రూపాయలు ఎలా కట్టాలని, ఇప్పటికైనా సంఘాలు స్పందించాలని పలువురు చిరు వ్యాపారులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ప్రతినిధులు

తాండూరు, ఆగస్టు 20: తాండూరు పట్టణంలో పది రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిందని సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ నాయకులు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఖాళీ బిందెలు పెట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఏఈ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రసుత్తం శ్రావణమాసం హిందువులకు ప్రత్యేక మాసమని, ఎన్ని పండుగలు వ్రతాలు, పూజలు ఉంటాయని, ఈ సమయంలో తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పక్కనే ఉన్న కాగ్నా నది నుంచి గతంలో మాదిరిగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన రోడ్లలో వీధిదీపాలు వెలగడంలేదని, జిల్లా ఆస్పత్రి వద్ద దుర్వాసనతో నిండిన మురుగు నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ఓబీసీ కార్యవర్గ సభ్యులు గాజుల శాంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, తాండూరు అసెంబ్లీ కన్వీనర్ రజని కాంత్, పట్టణ ప్రధానకార్యదర్శి అంతారం కిరణ్‌కుమార్, శ్రీకాంత్, చందు, ప్రభాకర్ గౌడ్, వడ్డె సాయిలు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా నీళ్లు బంద్

గడిచిన నాలుగు రోజులుగా తాండూరులో తాగు నీటి సరఫరా బంద్ అయింది. శ్రీశైలం నుంచి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలోని గాంధీనగర్, సర్రాఫ్ బజార్ ఏరియాల్లో బోర్లు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా మున్సిపాలిటీ అధికారులను నీటి ఎద్దడి సమస్యను తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి, తాగునీటి ఎద్దడి లేకుండా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

'స్థానిక' ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఆమనగల్లు, ఆగస్టు 20 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం యూటీఎఫ్ భవన్‌లో.. 'బీసీలకు 42శాతం రిజర్వేషన్లు-సమగ్ర కులగణన'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ నాగుల వేణు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ రవి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యయాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బీసీల రిజర్వేషన్ల పెంపు, ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను విస్మరించే, నిర్లక్ష్యం చేసే పార్టీలకు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి బీసీలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సదానందంగౌడ్, లాలూయాదవ్, గంగాధర్, రాజేందర్, గోపాల్, రమేశ్‌యాదవ్, రాఘవేందర్, మురళి, శ్రీనివాస్‌యాదవ్, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.


ఇండుబ్రోలో షెల్డ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

స్వయం ఉపాధితో ఎదగాలి

కేశంపేట, ఆగస్టు 20: స్వయం ఉపాధిలో యువత ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం కేశంపేట కాకునూర్-కొండారెడ్డిపల్లి శివారులోని ఇండుబ్రో పౌల్ట్రీలో నాటుకోళ్ల మదర్ యూనిట్ సందర్శించారు. డీఆర్డీఏ పీడీ మట్లాడుతూ.. స్వయం సంఘాల ఆధ్వర్యంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలన్నారు. కాకునూర్‌లో మోటె శ్రీను కోళ్ల ఫారాన్ని సైతం ఆమె పరిశీలించారు. 'పీఎం కుసుమ్' స్కీం కింద సోలార్ యూనిట్ ఏర్పాటుకు కేశంపేట సబ్‌స్టేషన్‌లో 2ఎకరాల ప్రభుత్వ భూమికి పరిశీలించారు. అనంతరం మానసిక పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్ సూర్యరావు, ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్లు బాలరాజు, స్వర్ణలత, నరసింహ, ఇన్‌చార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏఈ నర్సింగ్‌రావు, ఏపీఎం భగవంత్, ఇండుబ్రో ఎండీ కోటయ్య, మేనేజర్ రాంబాబు, ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేయించిన ట్రాఫిక్ పోలీసులు



చేవెళ్ల, ఆగస్టు 20: చేవెళ్లలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షానికి భారీగా గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ట్రాఫిక్ సీఐ వెంకటేశం స్పందించి హైవేపై గుంతలను సీసీతో పూడ్చివేయించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో రోడ్లు దెబ్బతియన్నాయని, వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు గుంతలను వెంటనే పూడ్చివేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


చేవెళ్ల బస్టాండ్‌లో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

బస్టాండ్ విస్తరణ పనులు వేగతం చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 20 : చేవెళ్లలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యాదయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం బస్‌స్టాండ్ ప్రాంగణంలో రూ.3కోట్లతో చేస్తున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ నిధులు రూ.3కోట్లతో బస్టాండ్‌ను ఆధునీకీకరిస్తున్నామని తెలిపారు. ఈ పనులు చివరి దశకు చేరాయన్నారు. త్వరలోనే ప్రయాణికులకు బస్‌స్టాండ్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు వసంతం, ఆగిరెడ్డి, రాములు, పెంటయ్యగౌడ్, రాములు, ప్రభాకర్, శంకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.


కొడంగల్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చుస్తున్న ప్రయాణికులు

కిక్కిరిసిన బస్టాండ్



కొడంగల్ రూరల్, ఆగస్టు 20: రాఖీ పౌర్ణమికి అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి వెళ్లిన మహిళలకు సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో కొడంగల్ బస్టాండ్ మంగళవారం కిక్కిరిసింది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో చాలాసేపు బస్సుల కోసం ఎదురుచూశారు. బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో చాలామంది ఫుట్‌బోర్డుపై ప్రమాదపు అంచున ప్రయాణం చేశారు.

వర్షాలకు కళకళలాడుతున్న పంటలు


కొడంగల్ శివారులో పత్తిపంట

వారం రోజులుగా అడపదడపా వర్షాలు కురుస్తుండంతో రైతులు సాగుచేసిన పత్తి, కంది తదితర పంటలు కళకళలాడుతున్నాయి. మండలంలో రైతులు పత్తిపంటకు అడుగు మందులు, చీడపీడల నివారణకు రసాయన మందులను స్ప్రే చేయడంలో బీజీబీజీగా మారారు. దీంతో పొలంలో కాడెడ్లతో గుంటుకలను తోలడం, కూలీలతో కలుపు తీయించడం తదితర పనుల్లో నిమగ్నమయయ్యారు. పెసర పంట సాగుచేసిన రైతులు హార్వెస్టర్ యంత్రాలతో కోయించి రాసులు చేస్తున్నారు.


కొడంగల్ రూరల్, ఆగస్టు 20


చిట్లపల్లి గ్రామ శివారులో ఉన్న కందిపంట

కుండపోత

(ఐదో పేజీ తరువాయి)

పొంగి పొర్లాయి. పత్తి, అరటి, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు సందర్శించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. యాలాల మండలంలో భారీ వర్షంతో చెరువు కుంటల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వర్షానికి రాఘవపూర్ చెరువు నిండి అలుగు పారింది. రాఘవపూర్, విశ్వనాథ్‌పూర్, సంగెంకుర్దు గ్రామాల పరిధిలోని కొన్ని పంట పొలాల్లో వర్షం నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. నవాబుపేట మండలంలోని మూసీ నదిలో వరద నీరు భారీగా చేరడంతో చంచల్‌పేట్, అక్నాపూర్, అత్తాపూర్, నారేగూడ, గంగ్యాడ, ముబారక్ పూర్, గుబ్బడి ఫతేపూర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది.



మేడ్చల్ జిల్లాలో.

మేడ్చల్(ఆంధ్రజ్యోతి)/మేడ్చల్ టౌన్/కీసర రూరల్ : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో పలు కాలనీలోని సెల్లార్‌లలోకి, రోడ్లపైకి వరద నీరు వచ్చింది. చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. మేడ్చల్‌లోని సుతారిగూడ, గుండ్లపోచంపల్లి చెరువులతో పాటు మండలంలోని పలు చెరువుల్లో వర్షం నీరు చేరింది. ఎగువన ఉన్న దమ్మాయిగూడ నుంచి వరద పోటెత్తడంతో నాగారంలోని పలు కాలనీలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా కీసర నుంచి కుషాయిగూడకు వెళ్లే దారిలో దాదాపు రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాగారం మున్సిపాలిటీలోని లోతట్టు కాలనీలైన బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయినగర్ కాలనీల్లోని రోడ్లు చెరువులను తలపించాయి. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.


టంగటూరు ఉన్నత పాఠశాలలో చేరిన వర్షం నీరు

చెరువును తలపిస్తున్న రోడ్లు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోనూ సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఏపీజీబీవీ ఎదుట హైదరాబాద్ - శ్రీశైలం జాతీయరహదారిపై వర్షం నీరు చేరడంతో చెరువును తలపించింది.

చెరువులను తలపించిన రోడ్లు

ఇబ్రహీంపట్నం :ఇబ్రహీంపట్నం టౌన్ సహా పరిసర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం గంటపాటు దంచికొట్టడంతో రోడ్లు చెరువును తలపించాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అలుగు పారుతున్న నాయినివాని చెరువు

కందుకూరు: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం తెల్లవారు జాము నుంచే వాన దంచి కొట్టింది. దీంతో ధన్నారం, పులిమామిడి, జైత్వారం గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. నాయినివాని చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతోంది. అలాగు కొత్త గూడ గ్రామలోని సున్నం చెరువులోకి వరద నీరు చేరుతోంది.


మైసమ్మగూడలో జలమయమైన మల్లారెడ్డి యూనివర్సిటీ


మైలార్‌దేవరంపల్లిలో వరదకు కొట్టుకుపోయిన పత్తి పంట


నాగారంలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

రాఘవేందర్‌పై దాడి అమానుషం

» చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్/పూడూరు, ఆగస్టు 20: బీజేపీ పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్‌పై జరిగిన దాడి అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాఘవేందర్‌ను బుధవారం పరామర్శించిన ఆయనఈ ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూ కబ్జాలకు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు కద్మూర్ ఆనందం, అతడి అనుచరులు రాఘవేందర్‌పై రివాల్వర్‌తో బెదిరించి దాడిచేయడం అమానుషమైన చర్య అని అన్నారు. ఈ విషయంపై తక్షణమే సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దాడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, ఉప్పరి రమేష్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

స్వచ్ విద్యాలయ ట్రక్కు ప్రారంభం

మర్పల్లి: చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలను శుభ్రపర్చే బాధ్యత తమ సంస్థదేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జేకేయంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ విద్యాలయ ట్రక్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో దాదాపు 300పాఠశాలలు ఉన్నాయని, ప్రతీ పాఠశాలకు ట్రక్కు వెళ్లి మూత్రశాలలను శుభ్రపరుస్తుందన్నారు. ఎన్నో పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరు బాధ్యత వహిస్తే ఈ పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు అంజయ్య, ఫౌండేషన్ ఇన్‌చార్జి రాములు, మర్పల్లి కో ఆర్డినేటర్ శేఖర్, సభ్యులు సంగమేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్‌లో స్థానికులతో చర్చిస్తున్న సత్యనారాయణరెడ్డి

24గంటలు విద్యుత్ అందిస్తాం

» వికారాబాద్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణరెడ్డి

ధారూరు, ఆగస్టు 20: ధారూరులో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని వికారాబాద్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ధారూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులు, వ్యాపారులు, వినియోగదారులు, రైతులతో సమావేశమై విద్యుత్ సమస్యలపై చర్చించారు. ధారూరులో చీటికిమాటికి కరెంట్ తీస్తున్నారని, పాతకాలం నాటి విద్యుత్ స్తంబాలు, విద్యుత్ తీగలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు, వినియోగదారులు ఏడీని కోరారు. అనంతరం గ్రామంలోని పాత విద్యుత్ స్తంబాలను, విద్యుత్ లైన్‌ను ఏడీ పరిశీలించారు. పాత ఇనుప విద్యుత్ స్తంభాలను, అతుకులు, వేలాడిన విద్యుత్ తీగలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామం మధ్యలో ఏర్పాటుచేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి రెండు నెలల్లో ఈ సమస్యలన్నింటినీ క్లియర్‌చేసి మరోసారి సమావేశమవుతానని ఏడీ తెలిపారు. అదేవిధంగా విద్యుత్ మొండిబకాయిల విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదన్నారు. వినియోగదారులు బకాయిలు చెల్లించి సహకరించాలని కోరారు. డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలన్నారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరో బిల్లులు రాకుంటే ఎంపీడీవో కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలి

» జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 20: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్ నుంచి మంగళవారం డీఎల్‌ఎంటీలు, ఏఎల్‌ఎంటీలకు ఏర్పాటు చేసిన ట్రెయినింగ్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీఒక్కరికి ఓటరు జాబితాలో చోటుకల్పిస్తూ సర్వేచేయాలని బూత్‌లెవల్ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగిన కార్యచరణ రూపొందించాలన్నారు. జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణ 2025కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024వరకు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలన్నారు. ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల నూతన ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు 100 శాతం వెరిఫికేషన్, పోలింగ్‌స్టేషన్ మార్పు అవసరముంటే చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28 వరకు జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటు హక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాన్ని రూపొందించాలన్నారు. మృతుల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటరు జాబితా నుంచి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. అదేవిధంగా ఫారం 6, 6ఏ, 6బీ గురించి వివరించారు. ఓటరు జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, ఓటర్‌కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయి, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్‌అలీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శంషాబాద్ రూరల్, ఆగస్టు 20:రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మంగళవారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ పరిధి ఐదు డివిజన్లు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, ఒక రూరల్ మండలం ఉన్నాయని సీఎంకు ఇచ్చిన వినతి పత్రంలో వివరించారు. జీవో 111తో ఇప్పటికే వెనకబడిన శంషాబాద్ మండలం ప్రభుత్వ నిధుల్లేక ప్రజలకు అవసరాలు తీర్చలేకపోతున్నామని సీఎంకు చెప్పారు ఎమ్మెల్యే. గండిపేట్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పేదవిద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన సీఎం నియోజకవర్గానికి తప్పకుండా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

వైభవంగా సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు

» హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మహేశ్వరం, ఆగస్టు 20: తుక్కుగూడ పరిధి రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. రావిర్యాల, సర్ధార్‌నగర్, తుక్కుగూడ గ్రామాల మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు చేసి బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, పలువురు నేతలు ఆలయంలో పూజలు చేశారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా ఉండాలని అమ్మ వారిని కోరుకున్నట్టు బండి సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రత్నం, మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, వీరేందర్ గౌడ్, నర్సింహ్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కాటం భాస్కర్‌గౌడ్, పాండురంగారెడ్డి, రఘుమారెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.


ఆలయంలో పూజల అనంతరం బయటకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న శ్రీరాం

కొడంగల్ రూరల్, ఆగస్టు 20: ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కొడంగల్ మున్సిఫ్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయాధికారి శ్రీరాం అన్నారు. కొడంగల్‌లో కోర్టు ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, పూలమొక్కలను నాటారు. మామిడి, అల్లనేరేడు, ఉసిరి, జామ మొక్కలతో పాటు పూలు తదితర మొక్కలను నాటినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటయ్య, సంతోష్‌కుమార్, ట్రెజరర్ కె.రమేష్, న్యాయవాదులు, కరుణాకర్‌రెడ్డి, ఏవీ.ఆనంద్, యూ.బస్వరాజ్, రవీందర్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు శంకర్‌కు అండగా ఉంటాం



శంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్, ఆగస్టు 20: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు శంకర్‌కు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో అనేక పతకాలు సాధించిన శంకర్‌ను మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సన్మానించారు. ఆయన మాట్లాడుతూ చౌడమ్మగుట్ట పరిధి ఎర్రబిరుసుతండాకు చెందిన శంకర్ షాద్‌నగర్ పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడం గర్వకారణమన్నారు. 8 పతకాలు సాధించిన శంకర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

ఎంపీడీవోకు నాయకుల సన్మానం

తలకొండపల్లి, ఆగస్టు 20 : జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీవో గా అవార్డు అందుకున్న శ్రీకాంత్‌కు మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్‌లో ఎంపీడీవోను బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మండల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి శ్రీకాంత్ చొరవను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీవో రాఘవ, ఏఈ విద్యాసాగర్, రాధాకృష్ణ, శివ, గణేశ్, రాము, నందీశ్, మహేశ్, రాజశేఖర్, ఉదయ్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తలకొండపల్లి, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ ఉప్పల అఖిల్ అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులు దరిచేరవన్నారు. జంగారెడ్డిపల్లిలో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో హైదరాబాద్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది 196మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, మోహన్‌రెడ్డి, మధు, మహేశ్, చంద్రమౌళి, వంశీ, శివ, షైసయ్య, మల్లయ్య, పెంటయ్య, లక్ష్మయ్య, నర్సింహ్మా, కామినేని ఆసుపత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించాలి

చేవెళ్ల, ఆగస్టు 20 : మండల పరిధి తల్లారంలో కొద్ది రోజులుగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం గ్రామస్తులు, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్లలో ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో అధికారులకు సమస్యను వివరించారు. వారంపది రోజులుగా గ్రామంలో తరచూ కరెంటు పోతోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. లైన్‌మన్ కృష్ణకు చెప్పినా స్పందించడం లేదన్నారు. అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సేవలందించని లైన్‌మన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, కుమార్‌గౌడ్, మాణిక్యం, రాజు, అక్బర్ పాల్గొన్నారు.

తండాలపై అధికారులు దృష్టి పెట్టాలి

చౌదరిగూడ, ఆగస్టు 20: అధికారులు తండాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఏఈ రవికుమార్‌కు తండా వాసులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. చింతకుంట తండాలో విద్యుత్ సమస్య ఉందని లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని ఏఈకి ఫిర్యాదు చేశారు. 3 నెలల నుంచి వేపకుచ్చతండా నుంచి జేమ్లా తండాకు వెళ్లే దారిలో విద్యుత్ 11కేవీ వైర్లు రోడ్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా మారాయన్నారు. గోవులబంబ తండాలో స్తంభాలు రోడ్లపై నేలకొరిగాయని, రైతులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదన్నారు. అధికారులు వెంటనే విద్యుత్ వైర్లు సరిచేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆకాశ్‌నాయక్, రామ్‌చరణ్, వినోద్‌నాయక్, మన్య, రాహుల్‌నాయక్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 20: హైదరాబాద్-బీజాపూర్ రహదారి విస్తరణలో చేవెళ్ల బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న తమకు తగిన పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు మంగళవారం ఆర్డీవో సాయిరాంకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 89, 90లలో 2016లో లక్ష్మీనగర్ పేరిట చేసిన వెంచర్లో ప్లాట్లు కొన్నట్టు తెలిపారు. 2018లో రోడ్డు విస్తరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసి తమ ప్లాట్లను రోడ్డు కోసం సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అయితే పరిహారం మాత్రం ఇవ్వలేదన్నారు. తమకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్లాట్ల ఓనర్లు రాజశేఖర్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్, వేణు, శివకుమార్, రాజేందర్‌రెడ్డి, గోవర్ధన్, సుదర్శన్ రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కొందుర్గు, ఆగస్టు 20: కొందుర్గులో మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. సాయంత్రం 6గంటల నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాన్ని, గ్రామాన్ని ఎల్లమ్మ తల్లి చల్లగా చూడాలని మొక్కుకున్నారు. గౌడ సోదరులు ఎల్లమ్మకు కల్లుసాక సమర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్, రామయ్యగౌడ్, చేవెళ్ల కృష్ణయ్య, జగదీశ్వర్‌గౌడ్, జగన్‌గౌడ్, అశోక్‌గౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి తరలుతున్న మహిళలు

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



షాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

షాబాద్/ చౌదరిగూడ/ కందుకూరు/ ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/ షాద్‌నగర్/చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/కొత్తూర్, ఆగస్టు 20 : ప్రధాన మంత్రిగా దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీమని కాంగ్రెస్ నాయకులన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. షాబాద్‌లో పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్‌గాంధీ పునాదులు వేశారన్నారు. సాంకేతిక విప్లవానికి ఆద్యుడన్నారు. చిన్న వయసులోనే ప్రధానిగా దేశానికి సేవలందించారన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వేణు, జనార్ధన్‌రెడ్డి, ఖాజామియా, ఆంజనేయులుగౌడ్, సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్ పాల్గొన్నారు. చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. యువతకు రాజీవ్‌గాంధీ స్ఫూర్తిదాయకమన్నారు. నాయకులు వెంకటనర్సింహారెడ్డి, సలీం, నర్సింలు, నవీన్‌కుమార్, అంజి, వెంకటేష్, దానేలు, భాస్కర్, మస్సూద్ పాల్గొన్నారు. కందుకూరులో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, మాజీ జడ్పీటీసీ బి.జంగారెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. వెంకట్రామ్‌రెడ్డి, జగన్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌కుమార్, రాంరెడ్డి, బాబు, జగదీష్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పీసీసీమెంబర్ ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు ఆమనగల్లులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు జగన్, వస్పుల మానయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మాజీ ఎంపీపీ ధనుంజయ, ఖలీల్, ఖాదర్, బాబ, సురేశ్‌నాయక్, శ్రీశైలం, అలీం, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్, ఫరీద్, కె.మల్లయ్య, యాదయ్య, విజయ్‌నాయక్, మహేశ్, రవీ, హరిలాల్, చంద్రు, వెంకటేశ్, మల్లేశ్ నాయక్ పాల్గొన్నారు. కడ్తాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, జిల్లా, రాష్ట్ర నాయకులు కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. జహంగీర్‌బాబ, చేగూరి వెంకటేశ్, లక్‌పతి, హీరాసింగ్, బిక్షపతి, రాంచందర్‌నాయక్, రాము, శంకర్, సత్యంయాదవ్, యాదయ్య, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్, అస్గర్ అలీ,యాదయ్య గౌడ్, భానుకిరణ్, రాజేందర్‌గౌడ్, బ్రహ్మచారి పాల్గొన్నారు. తలకొండపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. మోహన్‌రెడ్డి, రవీందర్, అజీం, ఆరిఫ్, డిగ్రీ కృష్ణ, నరేశ్, రమేశ్, తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, శేఖర్ పాల్గొన్నారు. దేశ ప్రధానుల్లో అత్యుత్తమ ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ నిలుస్తారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దేశాన్ని ఏకతాటిపై నడిపిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చెన్నయ్య, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, నాయకులు రాజీవ్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, జి.ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సున్నపు వసంతం, ఆగిరెడ్డి, రాములు, పెంటయ్యగౌడ్, రాములు, ప్రభాకర్, శంకర్, నరేందర్, మాణిక్యం, జనార్ధన్ పాల్గొన్నారు. మొయినాబాద్ మండలంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో నివాళి అర్పించారు. రాజీవ్ గాంధీజయంతి సందర్భంగా కొత్తూరు పీహెచ్‌సీలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జె.సుదర్శన్‌గౌడ్, దేవేందర్, జగన్, శ్రీనివాస్, సత్తయ్య, సురేందర్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.



చేవెళ్లలోని క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ ఫొటోకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య



కడ్తాలలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బిక్య, బిచ్యానాయక్



ఆమనగల్లులో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో శ్రీనివాస్‌గౌడ్, నాయకులు



కందుకూరులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకుల నివాళులు

ఎంబీఆర్ కన్వెన్షన్‌ను ప్రారంభించిన నటుడు మోహన్‌బాబు



నూతన కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు మోహన్‌బాబు, ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఆగస్టు 20: చేవెళ్ల పరిధి అంతారం స్టేజి సమీపంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ ఏర్పాటు చేసిన ఎంబీఆర్ కన్వెన్షన్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, సినీ నటుడు ఎం. మోహన్‌బాబు, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య హాజరై ప్రారంభించారు. ఈ వేడుకలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఆధునిక హంగులతో నిర్మించిన ఈ కన్వెన్షన్ హాల్ ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు అనువుగా ఉందన్నారు. నిర్వాహకులను వారు అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, కన్వెన్షన్ సెంటర్ ఓనర్లు మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ఆయన కుమారులు ఎం.యాదగిరి, వెంకటేశ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట'

కడ్తాల్, ఆగస్టు 20 : విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకనుగుణంగా వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాలలోని కస్తూర్బా బాలికల పాఠశాల వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసే తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులను మంగళవారం మండల నోడల్ అధికారి జంగయ్య, కేజీబీవీ ఎస్‌వో అనితలతో కలిసి ఆయన ప్రారంభించారు. పాత బోరులో నీటి మట్టం పడిపోయి విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. డీఈవో సుశీందర్‌రావు చొరవ తీసుకొని బోరు మంజూరు చేయించారు. కేజీబీవీలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ కార్యదర్శి భీముడు, టీచర్లు రాధ, ప్రియాంక, శ్రావ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ షోరూంను ప్రారంభిస్తున్న నాగరాజన్

హైదరాబాద్, ఆగస్టు 20: శంషాబాద్ రాళ్లగూడ మధురానగర్ కాలనీలో 'రామ్‌రాజ్' షోరూం ఏర్పాటైంది. రామ్‌రాజ్ గ్రూపు సంస్థల చైర్మన్ కేఆర్.నాగరాజన్, టీఎస్ఆర్ ఫార్మా అలెంబిక్ మేనేజింగ్ డైరెక్టర్ గుండు ప్రసాద్ ఈ షోరూంను మంగళవారం లాంఛనంగా ప్రారంభించగా, దేవి జువెలర్స్ భాగస్వామి రత్న మౌక్తిక జ్యోతి ప్రజ్వలన చేశారు. తిరుమల పౌల్ట్రీ ఫార్మ్స్ మేనేజింగ్ డైరెక్టర్ మల్‌రెడ్డి నరసింహారెడ్డి తొలి విక్రయాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ సంస్థల చైర్మన్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటిని భావితరాలకు అందించడమే తమ లక్ష్యం అన్నారు. అందుకు అనుగుణంగానే మేలిమి వస్త్రాల ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. అత్యంత విశ్వసనీయ, ఆకర్షణీయమైన బ్రాండ్‌ల జాబితాలో రామ్‌రాజ్ చేరిందన్నారు.

నేటి నుంచి కట్టమైసమ్మ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 20 : ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ముస్తాబైంది. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి 23 వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య తెలిపారు.

అట్టహాసంగా మాజీ జడ్పీటీసీ దశరథ్ జన్మదిన వేడుకలు



బర్త్ డే కేక్ కట్‌చేస్తున్న కంబాల పరమేశ్, జీఎల్ఎన్ రెడ్డి, ఆనంద్, నాయకులు

కడ్తాల్, ఆగస్టు 20: జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలను కడ్తాలలో మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్ఎస్, గిరిజన సంఘాలు, జేడీఎన్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.పరమేశ్, మాజీ సర్పంచ్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్‌లు కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దశరథ్‌నాయక్ సేవా నిరతిని వారు కొనియాడారు. దశరథ్‌కు మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్, బాల్‌రాజ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ సత్యంలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లచ్చీరామ్, సేవ్యానాయక్, గోపాల్, ప్రియరమేశ్, ఎం.నర్సింహ,అంజి, శ్రీను, బిక్య, పాండు, కృష్ణ, రమేశ్, రమణ, యాదయ్య, నర్సింహ, ప్రకాశ్ పాల్గొన్నారు.

'హామీల అమలుకు ప్రభుత్వం పనిచేస్తుంది'

కందుకూరు, ఆగస్టు 20: ప్రజలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేరులతో మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాలతో మూడో విడతలో పంట రుణాలు మాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని, అర్హులు అందరికీ రుణమాఫీ వస్తుందన్నారు. ఆగస్టు 15న మంజూరు చేసిన 2లక్షల రుణమాఫీ కొందరు రైతుల ఖాతాల్లో పడలేదన్నారు. ప్రతీ రైతుకు రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, దీనిపై ఎలాంటి అపోహలు పడొద్దని అన్నారు. రైతులు ఏఈవోలకు దరఖాస్తులు చేసుకోవాలని, తెల్ల రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తారన్నారు. సమావేశంలో నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, శమంతప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, వెంకట్రాంరెడ్డి, డి.శ్రీధర్, అజీజ్, జి.సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, జగదీష్, రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కుమార్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 20 : ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం శంషాబాద్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పై వన్ స్టోన్ యూ టర్న్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(35) రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. పెట్రోల్ మొబైల్ 2లో గస్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్, హోంగార్డ్ శ్రీనివాస్‌రెడ్డి క్షతగాత్రున్ని వెంటనే శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతిచెందాడని ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్ర పర్చామన్నారు. మృతుడి ఒంటి పై బ్లూ అండ్ బ్లాక్ కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ఉందని, ఆచూకీ తెలిసిన వారు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు ఢీకొని యువకుడు..



ఖాజాపాషా(ఫైల్)

నందిగామ, అగస్టు 20: రైలు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన నందిగామ సమీపంలో గల రైల్వేట్రాక్‌పై మంగళవారం చోటుచేసుకు ంది. రైల్వే పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన ఖాజాపాషా(22) కూలి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం నందిగామలో సమీపంలో రైలు ఢీకొని అతడు మృతిచెందినట్లు రైల్వేకాని స్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. షాద్‌నగర్ స్టేషన్‌మాస్టర్ అభిలేష్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



సువర్ణ(ఫైల్)

కందుకూరు,ఆగస్టు 20 : అత్త, మామ, మరిదిల వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీపట్నం మండలం ఆదిభట్లకు చెందిన సువర్ణ(33)కు మాదాపురానికి చెందిన శ్రీనివాస్‌తో 13ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి కొడుకు, కూతురు సంతానం. ఏడాదిగా శ్రీనివాస్ మరో మహిళతో సంబంధం పెట్టుకొని సువర్ణను వేధింపులకు గురిచేస్తున్నాడు. అతడికి తల్లి కమలమ్మ, తండ్రి పెంటయ్య, తమ్ముడు కిషన్ మద్దతిస్తూ వారుకూడా సువర్ణను వేధించారు. మనస్థాపానికి గురైన ఆమె మంగళవారం ఇంట్లో చీరతో ఉరేసుకుంది. సువర్ణ అన్న ఎ.కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

రెండు కార్లు ఢీ.. 8 మందికి గాయాలు



క్షతగాత్రులు





ప్రమాద ధాటికి నుజ్జయిన కార్లు

ఆమనగల్లు, ఆగస్టు 20: మండల పరిధి కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో 8 మంది గాయపడ్డారు. కార్లలో బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు ఎదురుగా అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో కారు ఢీకొన్నాయి. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఐదుగురు స్వల్పంగా, అచ్చంపేట వైపు వెళ్తున్న కారులోని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వివిధ ఆస్పత్రులకు తరలించారు. కాగా క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి వుంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వెంకటేశ్వర్లు సందర్శించి వివరాలు సేకరించారు.

మతి స్థిమితంలేని బాలుడి అదృశ్యం



సాయి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20: మతిస్థిమితంలేని ఓ బాలుడు తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కప్పాడుకు చెందిన చేతల్ల వెంకటేష్ కుమారుడు సాయి(16) కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. ఈ నెల 14న ఇంట్లో ఎవరూలేని సమయం లో సాయి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ తెలిసిన వారు 8712662361/8712571489/8712662419 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు, కుటుంబీకులు తెలిపారు.

సొంతూరు నుంచి బస్సులో బయల్దేరిన బాలుడు...



శ్రీకాంత్

చేవెళ్ల, ఆగస్టు 20:సొంతూరుకు వెళ్లి తిరిగి వస్తూ ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం బండిఎల్కిచర్లకు చెందిన ఖాజామోని నర్సింలు బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో కొన్నేళ్లుగా చేవెళ్లలోని భగత్‌సింగ్ కాలనీలో ఉంటున్నాడు. నర్సింలు కొడుకు శ్రీకాంత్(13) చేవెళ్లలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. స్కూలుకు రెండు రోజులు సెలవులు రావడంతో శ్రీకాంత్‌ను తల్లిదండ్రులు సొంతూరికి పంపారు. చేవెళ్లకు తిరిగి వచ్చేందుకు మంగళవారం ఉదయం 5గంటలకు బస్సులో ఎక్కినట్టు తెలిపారు. సాయంత్రమైనా బాలుడు రాలేదు. శ్రీకాంత్ ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 7901099443 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొదల్లోకి దూసికెళ్లిన స్కూలు బస్సు

● విద్యార్థులకు త్రుటిలో తప్పిన ముప్పు



ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 20: ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు పొదల్లోకి దూసుకెళ్లింది. బస్సు నిలిచిపోవడంతో విద్యార్థులకు త్రుటిలో అపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరులోని శ్రీ శివసాయి ఇంటర్‌నేషనల్ స్కూల్ బస్సు మంగళవారం ఉదయం మోత్కుపల్లిలో విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు బయల్దేరింది. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును నడపడంతో మోత్కుపల్లి దాటగానే అదుపుతప్పి రోడ్డు పక్క నున్న పొదల్లోకి దూసికెళ్లింది. బస్సు చెట్టును ఢీకొని నిలిచింది. అదృష్టవశాత్తు విద్యార్థులకు ఏమీ కాలేదు. సమాచారం అందుకున్న పాఠశాల యజమాన్యం ఇతర వాహనాల్లో విద్యార్థులను స్కూలుకు తరలించింది. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపినందుకే ప్రమాదం జరిగిందని విద్యార్థులు తెలిపారు. ఇలాంటి డ్రైవర్లను విధుల్లో పెట్టుకోవద్దని తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. అదృష్టం కొద్దీ ఎవరికీ ఏమీ కాలేదని అన్నారు.

జన్యు లోపంతో రెండు తలల దూడ జననం

● పుట్టిన కొద్దిసేపటికే మృతి



రెండు తలలతో పుట్టిన దూడ

ఆమనగల్లు, ఆగస్టు 20: చింతలపల్లిలో రెండు తలల దూడ జన్మించింది. గ్రామానికి చెందిన రైతు కొప్పు దానేలుకు చెందిన ఆవుకు మంగళవారం జన్యు లోపంతో రెండు తలల దూడ పుట్టింది. ఈ దూడను రైతులు, స్థానికులు ఆసక్తిగా చూశారు. కాగా దూడ పుట్టిన గంటల వ్యవధి లోనే చనిపోయింది. రెండు తలల దూడను పరిశీలించిన పశువైద్యాధికారి జన్యులోపంతో ఇలాంటివి చోటుచేసుకుంటాయని తెలిపారు.

సంక్షిప్తంగా...

● **మాడ్గుల:** మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వర్షాల్లేక పంటలు ఎండుతున్నాయని ప్రజలు మంగళవారం ఆలయాల్లో పూజలు చేశారు. మాడ్గులలో చింతల్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద నీళ్లతో అభిషేకం చేశారు. గ్రామంలో భజనలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ నూదిని సునితకొండల్‌రెడ్డి అన్నదానం చేశారు. నాయకులు రాములు, శిరింరెడ్డి, పొలిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

● **శంకర్‌పల్లి:** కార్మికులకు జీతాలు చెల్లించని ఎస్‌వీఎమ్‌ఎల్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఫత్తేపురంలో గల ఎస్‌విఎమ్‌ఎల్ కంపెనీ ముందు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు కంపెనీలో సీసీ రోడ్డు పనులు చేయగా కంపెనీ యాజమాన్యం వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులను బెదిరిస్తున్నారని తెలిపారు. అధికారులు కంపెనీపై చర్యలు తీసుకుని యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. శ్రీరాములు, రాజు తదితరులు ఉన్నారు.

● **కందుకూరు:** ఈ నెల 22న మండంలోని సార్లరావులపల్లిలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి ఆలయానికి శంకుస్థాపన చేయనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ రజితప్రవీన్ నాయక్ తెలిపారు. గురువారం ఉదయం 6గంటల నుంచి వేద పండితులల సమక్షంలో దేవాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి సార్లరావులపల్లి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం టౌన్ బృందావన్ కాలనీలో ఈ నెల 22 నుంచి 25 వరకు పోచమ్మ దేవత, సింహ వాహన, బలిపీఠ, శిఖర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ ఆకుల ఆనంద్‌కుమార్ తెలిపారు. 22వ వేద పండితులచే మహాగణపతి పూజ, సాయంత్రం ఊరేగింపు, 23న అభిషేకాలు, ప్రతిష్ఠాంగ హోమాలు, 24న పోచమ్మ దేవత, బలపీఠ, సింహ వాహన, శిఖర యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 25న ఆదివారం పోచమ్మ దేవత అమ్మవారి బోనాల ఉత్సవాలు ఉంటాయని భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

చేవెళ్ల: రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులు జనంతో కిక్కిరిస్తున్నాయి. మంగళవారం చేవెళ్ల బస్‌స్టాండ్‌లో జనం పెద్ద సంఖ్యలో కన్పించారు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచిచూశారు. ప్రతీ బస్సులో కిక్కిరిసి ప్రయాణించారు.

● **కడ్తాల్:** నిస్వార్థ సేవలకు చిరస్థాయి గుర్తింపు లభిస్తుందని కడ్తాల సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని వారు పేర్కొన్నారు. కడ్తాలలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్ఐగా పదోన్నతిపై షాద్‌నగర్‌కు బదిలీ అయిన చంద గోపాల్‌కు స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు నిరంజన్, ప్రసాద్ జీ, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **చౌదరిగూడ:** జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారిగా రాజేందర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ నుంచి బదిలీపై చౌదరిగూడ మండలానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కృష్ణమోహన్ రాజేంద్రనగర్‌కు బదిలీ అయ్యారు. రైతులకు సేవలందిస్తానని రాజేందర్‌రెడ్డి అన్నారు.